ప్రజా [illegible]

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బేగంపేటలో పైలట్ శిక్షణ విద్యార్థినిపై అత్యాచారం
శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుడే విద్యార్థినిపై అఘాయిత్యం


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 251 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 09 - 04 - 2026


# పనితీరుతో హైడ్రాకు జాతీయ ఖ్యాతి

- చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!
- హైడ్రా పనితీరుపై చెన్నై మెట్రోపాలిటన్ అథారిటీ ప్రశంసలు
- చెన్నైలో వరదల నివారణకు హైడ్రా మోడల్‌పై అధికారుల ఆసక్తి
- అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని చెన్నై అధికారులకు వివరించిన రంగనాథ్
- ఖానామెట్‌లో తాజాగా రూ.1200 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ :

హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పనితీరు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపడుతున్న చర్యలను ఆదర్శంగా తీసుకుని, తమ నగరంలో వరదల నివారణకు వినియోగించుకోవాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు సీఎండీఏ ఉన్నతాధికారుల బృందం ఒకటి హైదరాబాద్‌లో పర్యటించి, హైడ్రా కార్యకలాపాలను అధ్యయనం చేసింది. ఈ ప్రశంసలకు తగ్గట్టుగానే హైడ్రా తన దూకుడును కొనసాగిస్తూ నగరంలో మరో భారీ ఆపరేషన్‌ను - మిగతా 2 లో

హరీశ్ రావు బహిరంగసభకు

# అనుమతుల రద్దు



- గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా రైతుల నిరసన
- రైతులకు మద్దతుగా రేపు హరీశ్ రావు బహిరంగ సభ
- సభకు తొలుత అనుమతి ఇచ్చి, తాజాగా రద్దు చేసిన ప్రభుత్వం
- హైకోర్టును ఆశ్రయిస్తామన్న నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ :

వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా సాగుతున్న రైతుల పోరాటం ఉద్రిక్తంగా మారింది. - మిగతా 2 లో



2 లో

మెట్రో రైల్లో ప్రయాణించిన

## మంత్రి జూపల్లి

- ఎర్రమంజిల్ స్టేషన్‌లో మెట్రో రైల్ ఎక్కిన జూపల్లి
- తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే ప్రయాణించిన మంత్రి
- అందరితో ఓపికగా ఫొటోలు దిగిన జూపల్లి

# ఇరాన్‌లో పాలన మారింది

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ఇక కలిసి పనిచేస్తాం
- ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తాజా పోస్ట్.. ఇరాన్‌పై కీలక ప్రకటన
- ఇరాన్ ఇకపై యురేనియం శుద్ధి చేయదని వెల్లడి
- అణు ధూళిని తవ్వి తొలగించేందుకు ఇరాన్ కు సాయం చేసేస్తామని ప్రకటన
- తమ స్పేస్ ఫోర్స్ ఉపగ్రహాలు ఇరాన్ పై ఓ కన్నేసి ఉంచాయని వ్యాఖ్యలు



ఢిల్లీ :

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అత్యంత ఫలవంతమైన రీతిలో పాలన మార్పు జరిగిందని, ఆ దేశంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'ట్రూత్ సోషల్' వేదికగా ఆయన ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ ఇకపై యురేనియం శుద్ధి చేయదని ట్రంప్ తన పోస్టులో స్పష్టం చేశారు. భూమిలో లోతుగా పాతిపెట్టిన అణు ధూళిని తవ్వి తొలగించేందుకు ఇరాన్‌కు అమెరికా సహాయం చేస్తుందని తెలిపారు. ఇరాన్ ప్రస్తుతం అత్యంత కచ్చితమైన శాటిలైట్ నిఘాలో ఉందని, దాడి జరిగిన నాటి - మిగతా 2 లో

## నేడే కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు



2 లో

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

## తమిళనాడులో ఈసీ కొరడా





- సీఎస్‌పై బదిలీ వేటు, కొత్త సీఎస్‌గా సాయికుమార్
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు ఈసీ కీలక చర్యలు
- ప్రస్తుత సీఎస్ మురుగానందంపై వేటు, కొత్త సీఎస్‌గా ఎం. సాయికుమార్
- డీవీఏసీ చీఫ్‌గా సీనియర్ ఐపీఎస్ సందీప్ మిట్టల్ నియామకం
- బదిలీ అయిన అధికారులకు ఎన్నికల విధులు వద్దని స్పష్టం
- నిష్పక్షపాత ఎన్నికల కోసమే ఈ చర్యలని తెలిపిన ఈసీ

## హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు



2 లో

- ముగ్గురి మృతి
- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు





# ఏపీలో ఈ-బస్సులు




2 లో

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆర్ అండ్ బీ, రవాణా శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రాన్ని గుంతలు లేని రోడ్లుగా మార్చాలని ఆదేశం
- భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం జరగాలి
- తక్కువ ఖర్చుతో ప్రజా రవాణాకు ఎలక్ట్రిక్ బస్సులు

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆర్థికానికి ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం జరగాలి
- రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం
- పోర్టులను అనుసంధానిస్తూ ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు
- గోదావరి పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశం
- తక్కువ రవాణా వ్యయం కోసం ఈవీ బస్సుల వినియోగం పెంచాలని సూచన
- ప్రధాన నగరాలకు ఔటర్ కారిడార్ల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని నిర్దేశం
- రోడ్లు భవనాలు, రవాణాశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష




అమరావతి :

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. గోదావరి పుష్కరాల్లోపే రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'తొలగింపుల' జాతర!




పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 23న జరగబోయే తొలి దశ పోలింగ్‌కు సంబంధించి తాజాగా 27 లక్షల 17 వేలమంది ఓటర్లు జాబితాల నుంచి కనుమరుగైనట్టు సోమవారం అర్ధరాత్రి దాటాక ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసిన తుది జాబితా వెల్లడిస్తోంది. దీంతో ఇప్పటివరకూ జాబితాల్లో పేర్లు లేనివారి సంఖ్య దాదాపు 91 లక్షలకు చేరింది. రెండో దశకు సంబంధించి తొలగింపులు కూడా కలుపుకొంటే ఇది కోటికన్నా ఎక్కువే ఉండొచ్చు. న్యాయ నిర్ణయ పరిధి (అజ్యుడికేషన్) ప్రక్రియ గత నెలలో మొదలయ్యాక ఈసీ విడుదల చేసిన అనుబంధ జాబితా ఇది. సహజంగానే ముస్లిం మెజారిటీ ఉన్న ముర్షీదాబాద్‌లో అత్యధికుల పేర్లు తొలగించారు. అక్కడ అజ్యుడికేషన్ పరిధిలోకెళ్లిన 11,01,145 మందిలో 4,55,137 మంది అనర్హులుగా తేలారు. 'స్వచ్ఛమైన' జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలన్న దృఢ నిశ్చయంతోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు శ్రీకారం చుట్టామని బిహార్‌లో ఏరివేతలు మొదలెట్టినప్పుడే ఈసీ చెప్పింది. ఉద్దేశం మంచిదే కావొచ్చు. కానీ బిహార్ అనుభవం తర్వాతైనా ఆ ప్రక్రియకు పట్టే సమయంపై అంచనా ఉండాలి. అది లేకపోబట్టే లక్షలాదిమంది ఓటర్లు ఈసారి ఓటింగ్‌కు దూరం కాబోతున్నారు. వారి అప్పీళ్లపై ట్రిబ్యునళ్ల విచారణ జరుగు తోంది. వారిలో విశ్వసనీయమైన ఓటర్లుగా నిర్ధారణయ్యేవారు కూడా ఉండొచ్చు. కానీ 2031 అసెంబ్లీ ఎన్నికలకు తప్ప వారు ఓట్లేయటం సాధ్యపడదు. న్యాయ నిర్ణయ ప్రక్రియకు సమయం పడుతుంది గనుక అంతవరకూ ఓటర్ల జాబితాలను ఆపటం సాధ్యపడదని సోమవారం సుప్రీంకోర్టు చెప్పటంతో అలాంటి ఓటర్లకు ప్రస్తుతానికి తలుపులు మూసుకుపోయాయి. ఈ నెల 23న పోలింగ్ జరగబోయే 152 నియోజక వర్గాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదలైంది. 29న రెండో దశలో 142 నియోజకవర్గాల్లో జరగబోయే పోలింగ్‌కు సంబంధించిన జాబితా బుధవారం అర్ధరాత్రి విడుదలవుతుంది. వ్యవధి తక్కువున్న తరుణంలో సుదీర్ఘ సమయం పట్టే ఇంత పెద్ద ప్రక్రియను ఒక అంచనా లేకుండా ఈసీ చేపట్టడాన్ని ధర్మాసనం తప్పుబట్టకపోవచ్చు గానీ, సాధారణ పౌరుల దృష్టిలో ఈసీది దోషమే అవుతుంది. ఎందుకంటే వారు బాధితులు. నిజానికి బిహార్ 'సర్' బెంగాల్‌తో పోలిస్తే ఎంతో మెరుగు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే తొలగింపులు పూర్తికావటం వల్ల ఫామ్6 ద్వారా తిరిగి జాబితాలోకెక్కడానికి చాలామందికి అవకాశం వచ్చింది. బెంగాల్‌లో ఆ అదృష్టం దక్కలేదు. తమ పేరుందనుకునే లోగానే ఎవరో ఫామ్7 కింద ఫిర్యాదు చేశారన్న కారణంతో ఓటర్లకు తాఖీదులు పోయాయి. పనులన్నీ మానుకుని కార్యాలయాల చుట్టూ తిరిగి అవసరమైన పత్రాలు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం అనుమానమే. నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ లేని (అన్‌మ్యాప్డ్) సంగతి బయటపడినా, పేర్లలో అక్షర క్రమంలో స్వల్ప తేడాలొచ్చినా అనర్హులుగా జమవేయటం పెను సమస్యగా మారింది. తాజా జాబితాలో పేర్లు లేని వారిలో అనేకులు అడిగిన పత్రాలన్నీ ఇచ్చినా ఫలితం లేకపోయిందని బావురు మంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పెద్దయెత్తున అందజేసే ఫామ్7 పత్రాలను తీసుకుని, వాటి ఆధారంగా తొలగింపులు చేపడుతున్నారన్న ఆరోపణలు వాస్తవం అనటానికి ఒక బీజేపీ నాయకురాలి పేరిట దాఖలైన ఫిర్యాదులే తార్కాణం. ఆ సంగతే తనకు తెలియదని ఆమె చెప్పటం గమనించదగ్గ అంశం.ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారి సమస్య ఎన్నికల్లో ఓటేయలేకపోవటం మాత్రమే అయితే ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దొంగ ఓటర్ల జాతర మాదిరి ఉదంతాల్లో తప్ప చాలా సందర్భాల్లో పోలింగ్ 65 శాతానికి మించదు. కానీ ఈ 'సర్' వల్ల గల్లంతైన వారికి భవిష్యత్తులో కష్టాలు చుట్టుముడతాయి. వారి పౌరసత్వమే సంశయాస్పదంగా మారి దేశం నుంచి గెంటేసే ప్రమాదం ఏర్పడుతుంది. బెంగాల్‌లో పార్టీల మధ్య ఉన్న కలహాలు సాధారణ ఓటర్ల భవితవ్యాన్ని అగమ్యగోచరం చేస్తున్నాయి. ఈసీ సక్రమంగా వ్యవహ రించివుంటే, ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటే సమస్యలు తలెత్తేవి కాదు. ఆ సంస్థ చేతగానితనం సామాన్యుల బతుకుల్ని అయోమయంలోకి నెట్టింది.

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

మొదటిపేజీ తరువాయి –

నిర్వహించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై చర్చించారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉందన్నారు. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేశారు.రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలని, ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలన్నారు.

**రోడ్ల నిర్వహణలో చర్యలు :** రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలని, స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలని చంద్రబాబు చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనే అంశంపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయన్నారు.గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని, దీని కోసం సాస్కీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని అధికారులకు చెప్పారు.

**ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు :** రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలని స్పష్టం సీఎం చంద్రబాబు చేశారు. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయని తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉందని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్‌గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలన్నారు. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయం గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని, దీని నిమిత్తం ఏపీ లింక్ ద్వారా ఆర్థిక వనరుల్ని సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మౌలిక సదుపాయాల ద్వారా సామాన్యుడికి సౌకర్యాలు పెరగడం సహా ఆర్థిక లావాదేవీలు జరగాలని చెప్పారు. ప్రభుత్వం ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్న ప్రతి పైసా సద్వినియోగం చేస్తూ అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. ప్రస్తుతం 73 శాతం కార్గో రోడ్ రవాణ ద్వారానే వెళ్తోందని సీఎం వెల్లడించారు. రైల్వే ద్వారా వెళ్లే కార్గో వ్యయం తక్కువగా ఉన్నట్టే రహదారుల కార్గో వ్యయం కూడా తగ్గాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల మధ్యనున్న ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని ఆయా పోర్టులను అనుసంధానం చేసే సమయంలో ఆయా పోర్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాల సరిహద్దులను కలుపుకుని వెళ్లేలా ప్రధాన రహదారులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉండాలని స్పష్టం చేశారు.

**ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా :** జాతీయ రహదారులకు సమీపంలో ఉండే ప్రాంతాల అభివృద్ధి జరగాలని చంద్రబాబు చెప్పారు. జాతీయ రహదారులతో పాటు దేశ నిర్మాణం జరగాలన్నారు. ఏపీ పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా మారుతోందని, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు కనెక్టు చేసేలా రహదారులు రావాలని సూచించారు. వివిధ నగరాలకు రింగ్ రోడ్లు వస్తే ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయన్న సీఎం, పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా రహదారుల నిర్మాణం జరగాలన్నారు.ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం డోర్నాల హైవే, కల్వకుర్తి-నంద్యాల హైవే వంటి జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే కనెక్టివిటీ మరింత పెరుగుతుందని చెప్పారు. వివిధ కారిడార్ల ద్వారా 1335 కిలోమీటర్ల జాతీయ రహదారుల రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఏడాదిలో 24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని ఆదేశించారు. రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల్లో అవుటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని నిర్దేశించారు.

# నేడే కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి - దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 2016-2021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 18-19 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నా యంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు. 2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్ఆర్సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2016-2021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

# ఇరాన్‌లో పాలన మారింది

మొదటిపేజీ తరువాయి – నుంచి అక్కడ ఏదీ మార్పు చెందలేదని పేర్కొన్నారు. తమ స్పేస్ ఫోర్స్ ఉపగ్రహాలు ఇరాన్ పై ఓ కన్నేసి ఉంచాయని వివరించారు. ఇరాన్‌తో టారిఫ్‌లు, ఆంక్షల ఉపశమనంపై తాము చర్చలు జరుపుతామని కూడా ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న 15 డిమాండ్లలో చాలా వాటికి ఇప్పటికే అంగీకారం కుదిరిందని ఆయన తన పోస్టులో వివరించారు.

# హైదరాబాద్‌లో యువకులను 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు

మొదటిపేజీ తరువాయి – హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది.ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు.కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హరీశ్ రావు బహిరంగసభకు అనుమతుల రద్దు

మొదటిపేజీ తరువాయి – రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది.ప్రభుత్వం తొలుత అనుమతినిచ్చి, సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక వెనక్కి తగ్గడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలని చూడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, తాము వెనక్కి తగ్గేది లేదని, హైకోర్టును ఆశ్రయించి సభకు అనుమతులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, కేసులు కొత్త కాదని... బెదిరింపులకు భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతాంగ ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ఈ నెల 9న హరీశ్‌రావు సభను జరిపి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మెట్రో రైల్లో ప్రయాణించిన మంత్రి జూపల్లి



మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా, ఒక సామాన్య ప్రయాణికుడిలా మెట్రోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. నగరంలోని ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా, ట్రాఫిక్ ఇబ్బందులను దాటుకుని త్వరగా చేరుకోవడానికి మంత్రి మెట్రోను ఎంచుకున్నారు. సెక్యూరిటీ హడావుడి లేకుండా ఎర్రమంజిల్ స్టేషన్‌లో స్వయంగా టికెట్ కొనుగోలు చేసి మియాపూర్ వరకు ప్రయాణించారు.రైలులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, మంత్రి తన హోదాను పక్కన పెట్టి తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే వెళ్లారు. ప్రయాణ సమయంలో తోటి ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. మెట్రో సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రిని తమ మధ్య చూసిన ప్రయాణికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపగా, జూపల్లి ఎంతో ఓపికగా అందరితో ఫొటోలు దిగారు.సమయాన్ని ఆదా చేస్తూ, ట్రాఫిక్ చిక్కులు లేకుండా గమ్యస్థానాలకు చేరడానికి మెట్రో ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. గతంలోనూ ఆయన ఎల్బీ నగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు ఇలాగే ప్రయాణించి వార్తల్లో నిలిచారు.

# తమిళనాడులో ఈసీ కొరడా




మొదటిపేజీ తరువాయి – తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎన్. మురుగానందంను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. సాయికుమార్‌ను కొత్త సీఎస్‌గా నియమించింది. ఈ మార్పులను వెంటనే అమలు చేసి, బుధవారం సాయంత్రం 6 గంటలలోపు నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి, పారదర్శకత కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఈ మార్పులతో పాటు పరిపాలనలో మరో కీలక మార్పు కూడా చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ (డీవీఏసీ) చీఫ్‌గా ఉన్న డేవిడ్సన్ దేవశిర్వతంను బదిలీ చేసి, ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ మిట్టల్‌ను నియమించింది. మిట్టల్, డీవీఏసీతో పాటు ఆర్మ్‌డ్ పోలీస్ విభాగం అధిపతిగా కూడా వ్యవహరిస్తారు.బదిలీ అయిన అధికారులకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి ఎన్నికల సంబంధిత విధులు కేటాయించవద్దని ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకున్న తరుణంలో అధికార యంత్రాంగం దుర్వినియోగం కాకుండా, ప్రజలకు స్వేచ్ఛాయుత ఎన్నికలపై నమ్మకం కలిగించేందుకే ఈసీ ఇలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పనితీరుతో హైడ్రాకు జాతీయ ఖ్యాతి

HYDRAA

మొదటిపేజీ తరువాయి – విజయవంతంగా పూర్తి చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో రూ.1,200 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.ఖానామెట్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న ఈ అత్యంత విలువైన భూమిని కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు ఆక్రమించుకుని, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాయి. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నారు. వెంటనే అక్కడి తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి, స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమి చుట్టూ కంచె వేసి, ప్రభుత్వ ఆస్తి అని సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు.

**నాలాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి**

ఇటీవల చెన్నై నుంచి వచ్చిన సీఎండీఏ అధికారుల బృందం హైడ్రా పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యంగా నాలాలు, చెరువుల పునరుద్ధరణలో హైడ్రా అనుసరిస్తున్న వ్యూహాలపై వారు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వారికి అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని, వాటి ద్వారా వరద ముప్పును తగ్గించే ప్రణాళికలను వివరించినట్లు సమాచారం. హైడ్రా పనితీరు అద్భుతంగా ఉందని, ఈ మోడల్‌ను చెన్నైలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని సీఎండీఏ బృందం కొనియాడినట్లు తెలిసింది.2024లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అనతికాలంలోనే తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చెరువులు, పార్కులు, నాలాలతో పాటు విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కవచంలా నిలుస్తోంది.

# ఏపీలో ఈ-బస్సులు



మొదటిపేజీ తరువాయి – రాష్ట్రంలో రహదారులను గుంతలు లేకుండా పటిష్ఠంగా తీర్చిదిద్దాలని, ప్రజా రవాణాకు తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవారం ఆయన రహదారులు, భవనాలు (ఆర్ అండ్ బీ), రవాణా శాఖల పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కేవలం మరమ్మతులు చేయడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా నాణ్యమైన రోడ్లను నిర్మించాలని సూచించారు. మెరుగైన రహదారుల ద్వారానే ప్రజలకు మౌలిక సదుపాయాలు చేరువవుతాయని, తద్వారా రాష్ట్రాభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రజా రవాణా వ్యవస్థపైనా సమీక్షలో చర్చించారు. సామాన్యులపై భారం తగ్గించేలా, అతి తక్కువ వ్యయానికే ప్రయాణం సాగించేందుకు వీలుగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది నా పాదయాత్ర



మొదటిపేజీ తరువాయి – కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు.వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు.ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

ప్రజా మంటలు

గురువారం 09 - 04 - 2026

## మోతే గ్రామంలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) :**అర్బన్ మండలం మోతే గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ గ్రామానికి చెందిన సిరి నర్మద మోహన్ గార్ల ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి,కానుకగా చీర ను అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు.అదనంగా 1200 ఇళ్ళు మంజూరు.జగిత్యాల పట్టణములో 4520 డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పన చేయటం జరిగింది.జగిత్యాల కు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 5 కోట్లు మంజూరు అయ్యాయి.అభివృద్ధి కోసం ప్రభుత్వం తో కలిసి పనిచేస్తున్నా, విమర్శలకు అభివృద్ధి పనులతో సమాధానం చెప్తా అన్నారు.

# ప్రతి తల్లి సురక్షితంగా ఉండాలి

**హెల్త్ మినిస్టర్ మంత్రి దామోదర**





**సికింద్రాబాద్, ఏప్రిల్ 08 ( ప్రజా మంటలు):** రాష్ట్రంలో ప్రతి మహిళ, ప్రతి తల్లి సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బోయిగూడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మాతృ మరణాల తగ్గింపు, సి-సెక్షన్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, మిడ్‌వైఫరీ సేవలను బలోపేతం చేసి సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. పోషణ, కౌన్సెలింగ్ సేవలను గ్రామ స్థాయి వరకు విస్తరిస్తామని చెప్పారు.ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్, కమిషనర్ సంగీత సత్యనారాయణ, డా. రవీంద్ర నాయక్, డా. నరేంద్ర, డా. అజయ్, డా. శ్రీకాంత్, డా. కవిత, డా. వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టిన తెలంగాణ విద్యుత్ ఆర్టీసన్ , ఆన్ మ్యాన్ ఉద్యోగులు



**జగిత్యాల ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) :**రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జేఏసీ ఆదేశాలతో జగిత్యాల జిల్లా కేంద్రంలో విద్యుత్ ఆర్టిసన్, ఆన్ మ్యాన్ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు., ఈ సందర్భంగా విద్యుత్ డివిజన్ కార్యాలయం ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించిన ఉద్యోగులు, విద్యార్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్ల కార్డులు ప్రదర్శించారు., టీజీఎస్పీడీసీఎల్ లో అన్ మాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలని, 2026 పిఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో 2016 డిసెంబర్ 4 కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ, ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా కొనసాగుతున్నవారిని ఆర్టిసన్ గా గుర్తించాలని కోరారు. విద్యుత్ సంస్థలు బ్రిటిష్ కాలం నాటి విధానాలే కొనసాగుతున్నాయని పాలకులు, ప్రభుత్వాలు మారిన తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు .11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రోడ్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్



**బీర్పూర్ ఏప్రిల్ 8 ( ప్రజా మంటలు)** :మండల కేంద్రంలో 12 లక్షలతో ,చర్లపల్లి గ్రామంలో 5లక్షలతో,రంగాసాగర్ గ్రామంలో 4లక్షలతో,కండ్ల పల్లి గ్రామంలో 7 లక్షల 50 వేలతో, కమ్మునురు గ్రామంలో 5లక్షలతో,తుంగురు గ్రామంలో 9లక్షలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ గారు.ఈ కార్యక్రమంలో మాజీ కె డి సి సిజిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు,ఈఈ లక్ష్మణ్ రావు డి ఈ మిలింద్ ఎమ్మార్వో సుజాత ఎంపీడీవో భీమయ్యా ,సర్పంచులు రాజగోపాల్ రావు,హరీష్,మసీదు తిరుపతి,సాగర్,సత్తెమ్మ సురేందర్,తోట శ్రీనివాస్,నాయకులు వెంకటేష్ యాదవ్ నారపాక రమేష్ మహిపాల్ రెడ్డి శ్రీనివాస్ రావు రామకిస్తు గంగాధర్ అశోక్ శ్రీనివాస్ గంగరాజం ఉప సర్పంచ్ లు మల్లేశం,లింగన్న, రవి,గంగన్న,మాజీ సర్పంచులు నరేందర్,రవి,సంపత్,ప్రభాకర్, ఆర్ ఐ లు, ఏ ఈ లు,గ్రామ మండల నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతతో కొనసాగాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**బీర్పూర్ ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) :**జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతతో కొనసాగాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు. బుధవారం బీర్పూర్ మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతిని సమగ్రంగా ఆరా తీసిన జిల్లా కలెక్టర్, కార్మికుల హాజరు నమోదు విధానం, ఎన్ఎం ఎం ఎస్ యాప్ పరిశీలన, జియోట్యాగింగ్‌తో ఫోటో క్యాప్చరింగ్ ప్రక్రియలను పరిశీలించారు. పనుల వద్ద కార్మికుల హాజరు సరైన రీతిలో నమోదు చేయాలని, ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణ బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు సముచిత ఉపాధి కల్పించడమే లక్ష్యమని, ప్రతి అర్హుడికి పని దొరికేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం బీర్పూర్ మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘువరన్, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈపీఆర్ లక్ష్మణ్ రావు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## శాలపల్లిలో ఆంగ్ల మాధ్యమంపై అవగాహన

**ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో చైతన్యం అవసరం**

**సర్పంచ్ కూరపాటి అశోక్**




**వేలేరు మండలం,ఏప్రిల్ 08(ప్రజా మంటలు న్యూస్) :**వేలేరు మండలం శాలపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమ బోధనపై అవగాహన కార్యక్రమం ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలతో కలిసి నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ కూరపాటి అశోక్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భారత దేశ భవిష్యత్తు అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రగోల్ల రమేష్, మాజీ ఉపసర్పంచ్ అదర వెంకన్న, కూరపాటి రమేష్, కూరపాటి సంపత్, అదర కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో భాగంగా గర్భిణీ స్త్రీలకు వైద్య సూచనలు



**జగిత్యాల ఏప్రిల్ 8(ప్రజా మంటలు) :**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు అనుసరించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం, నియమిత పరీక్షలు మరియు ప్రసవానికి ముందస్తు ఏర్పాట్లపై వైద్యులు సలహాలు సూచనలు చేశారు.గర్భధారణ సమయంలో తల్లి మరియు శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు.సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవానికి (నార్మల్ డెలివరీ) ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని మాట్లాడుతూగర్భిణీ మహిళలు సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం, పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలను పాటించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అలాగే సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాత, జిల్లా ఉపవైద్యాధికారి జైపాల్ రెడ్డి, సూపరిండెంట్ కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పాల డెయిరీ సంఘ భవనానికి భూమి పూజ



**భీమదేవరపల్లి ఏప్రిల్ 08 (ప్రజా మంటలు)** :మండలం వంగర గ్రామంలో వంగర మహిళా పాల డైరీ2 సంఘం సొంత భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి మహిళా పాల డైరీ సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి సంఘాలు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. మహిళా పాల డైరీ సంఘానికి సొంత భవనం నిర్మాణం కావడం గ్రామ అభివృద్ధికి మంచి అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ సభ్యులు మారం సతీష్, గజ్జల రమేష్, సూపర్వైజర్ వసంత, మహిళా పాల డైరీ సంఘం కార్యవర్గ సభ్యులు కాల్వ సునీత, గౌరవేణి భాగ్య, ఆషాడపు లక్ష్మి, నీలం శోభ, మరి రాజమ్మ, బల్ల లావణ్య, బల్ల శ్రీదేవి, ఘనకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు కాల్వ సంపత్, వెంగళ నారాయణ, ఏనుక శ్రీనివాస్, నల్లగోని రమేష్, నీలం బిక్షపతి, మ్రరి రవి, మర్రి దొడ్డయ్య తదితరులు హాజరయ్యారు.

## జియాగూడ కమేల మూసివేతపై ఎస్‌హెచ్‌ఆర్‌సీ కి ఫిర్యాదు

**లాయర్ ఫిర్యాదుతో వెలుగులోకి 10 వేల కార్మికుల దుస్థితి**



**సికింద్రాబాద్, ఏప్రిల్ 08 ( ప్రజామంటలు):**జియాగూడ అబాటోయర్ (కమేల) మూసివేత వ్యవహారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి వెళ్లింది. ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఆర్‌సీ కేసు నం. 1396/36/2/2026 గా నమోదు చేసింది.ముందస్తు నోటీసులు లేకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కమేలాను మూసివేయడంతో సుమారు 10 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎనిమిది రోజులుగా పనిలేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ఆరె కటిక, ముస్లిం వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు ఈ కమేలపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారని అడ్వకేట్ రామారావు ఇమ్మనేని తెలిపారు.

## డిహెచ్ పి ఎస్ మహాసభలను విజయవంతం చేయండి



**ఎల్కతుర్తి ఏప్రిల్ 08 ప్రజా మంటలు :**దళిత హక్కుల పోరాట సమితి డి హెచ్ పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఎల్కతుర్తి మండలంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.హెచ్.పి.ఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ మాట్లాడుతూ, స్వతంత్రం వచ్చిన 76 సంవత్సరాలు గడిచిన దళితులు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి బడ్జెట్ లో దళితులకు 20% నిధులు కేటాయించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో సూచించినప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని అన్నారు. దళితులకు కేటాయించాల్సిన నిధులు ఇతర శాఖలకు మళ్ళిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్సి ఎస్టి సబ్ ప్లాన్ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇల్లు లేని దళితులకు ఇందిరమ్మ ఇళ్లలో 50% వాటా పారదర్శకంగా కల్పించాలని కోరారు. ఏప్రిల్ 17-18 తేదీలలో వరంగల్ లో జరిగే డిహెచ్ పిఎస్ రెండవ రాష్ట్ర మహాసభలకు హనుమకొండ జిల్లా గ్రామ మండల స్థాయి నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మర్రి శ్రీనివాస్, శనిగరపు రాజుకుమార్, తండ మొండయ్య, ప్రకాష్ రాజు, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం నుంచి ప్రారంభమైన భూమిహైర్ రైతులకు టెక్నాలజీతో కొత్త దారి




**ఎల్కతుర్తి మార్చి 8 ప్రజా మంటలు** :కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ప్రారంభమైన భూమిహైర్, వ్యవసాయ రంగంలో ఒక వినూత్న మార్పును తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.నేటి వ్యవసాయంలో యంత్రాల అవసరం పెరుగుతున్నప్పటికీ, అవి సమయానికి అందుబాటులో లేకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా భూమిహైర్ రైతులు మరియు యంత్ర యజమానులను ఒకే ప్లాట్‌ఫామ్‌లో కలుపుతోంది.ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా రైతులు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రోన్ స్ప్రేయింగ్, బోర్‌వెల్ సేవలను అద్దెకు సులభంగా పొందగలుగుతున్నారు. దగ్గరలో ఉన్న యంత్రాలను మాత్రమే చూపించడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు తగ్గి, పనులు వేగంగా పూర్తవుతున్నాయి.ఇక యంత్ర యజమానులు కూడా తమ యంత్రాలను అద్దెకు ఇచ్చి అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈ విధంగా భూమిహైర్ వ్యవసాయ రంగంలో సమర్థవంతమైన కనెక్షన్‌గా పనిచేస్తోంది.గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులు యాప్‌పై ఆసక్తి చూపిస్తూ నమోదు అవుతున్నారు. ఈ సేవ ఇప్పటికే గ్రామస్థాయిలో మంచి స్పందన పొందుతోంది.యాప్‌ను ఉపయోగించడానికి గూగుల్‌లో సెర్చ్ చేసి రిజిస్టర్ అవ్వాలి. అవసరమైన సేవలను సులభంగా బుక్ చేసుకోవచ్చు.మరిన్ని వివరాల కోసం సోషల్ మీడియాలో సెర్చ్ చేసి ఫాలో అవ్వవచ్చు.సంప్రదించడానికి ఫోన్: 7337291961భవిష్యత్తులో ఈ సేవను మరింత ప్రాంతాలకు విస్తరించి, రైతులకు సమయానికి సేవలు అందించడం ద్వారా వ్యవసాయ రంగంలో ఒక పెద్ద మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో భూమిహైర్ ముందుకు సాగుతోంది.

## వెల వెల బోతున్న “వార్డ్ సభ్యుల“ శిక్షణా తరగతులు



**బుగ్గారం :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శెఖల్ల లోని రైతు వేదికలో జరుగుతున్న వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులు రోజు - రోజుకు వెల వెల బోతున్నాయి. బుధ వారం జరిగిన మూడో రోజు శిక్షణా తరగతులకు అతి తక్కువ సంఖ్యలో సభ్యులు హాజరు అయ్యా రు. పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల, జిల్లా కలెక్టర్ ల ఆదేశాలు భే ఖాతర్ చేసి మండల అధికారులు నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతుల పట్ల అందరూ నిరాశ, నిస్పృహ లకు లోనవుతున్నారు.

## అవినీతి అధికారులకు చిక్కిన హెడ్మాస్టర్, క్లార్క్



**మహబూబాబాద్, ఏప్రిల్ 08 (ప్రజా మంటలు):**మహబూబాబాద్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు జరిపిన దాడుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.జిల్లాలోని గూడూరు మండలం, అయోధ్యాపురం గ్రామంలోని జెడ్‌పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీ జె. రవి కుమార్ (ఎం ఈ ఓ గూడూరు)తో పాటు, జెడ్‌పీహెచ్ఎస్ మహబూబాబాద్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ మరియు ఇన్‌చార్జ్ క్లర్క్ శ్రీ జి. చంద్ర మౌళి లంచం తీసుకుంటూ ఎసిబి వారంగల్ యూనిట్‌కు చిక్కారు.ఫిర్యాదుదారుడి పెన్షన్ సంబంధిత సిపిఎస్ రిటైర్మెంట్ బిల్లులు సిద్ధం చేసి, ఏ జి ఏ కార్యాలయానికి పంపేందుకు సహకరించాలనే నెపంతో రూ.15,000 లంచం డిమాండ్ చేసి, స్వీకరిస్తున్న సమయంలో అధికారులు వారిని పట్టుకున్నారు.ఈ సందర్భంగా లంచం మొత్తాన్ని చంద్ర మౌళి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. తమ విధులను దుర్వినియోగం చేసి అన్యాయ లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు.ఇద్దరినీ అరెస్ట్ చేసి, వరంగల్‌లోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి వివరాలు భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచినట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

## కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలతో తెలంగాణలో మార్పు కవిత ప్రకటన



**హైదరాబాద్, ఏప్రిల్ 09 (ప్రజా మంటలు):**తెలంగాణ భవిష్యత్‌ను, చరిత్రను మార్చే రోజుగా ఈ నెల 25 నిలుస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆ రోజు ప్రకటించబోయే కొత్త పార్టీ ద్వారా ఈ గడ్డకు కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను పరిచయం చేస్తామని వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్ తన అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రజల కోసం ప్రశ్నించే, పోరాడే, పరిష్కారాలను అందించే కొత్త తరహా రాజకీయాలు తీసుకురాబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో అధికార పక్షమైన కాంగ్రెస్, ప్రతిపక్షం బీ.ఆర్.ఎస్. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలపై మాట్లాడేది జాగృతి మాత్రమే అన్న నమ్మకం ప్రజల్లో పెరుగుతోందని తెలిపారు.దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే రేవంత్ రెడ్డి నిలబడి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు స్వయంపాలన వచ్చిందని భావించిన ప్రజలకు ఢిల్లీకి గులాంగిరి చేసే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కేంద్రంపై కూడా స్పందించకుండా నరేంద్ర మోదీ నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందని విమర్శించారు.గద్వాల్ ప్రాంతంలో గడీల ప్రభావం తొలగి ఉద్యమకారుల జెండా ఎగరాలని, చేనేత కార్మికులు, సీడ్ పత్తి రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న మూడు సంవత్సరాలు ప్రజల తరపున ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.ఇక రంజిత్ కుమార్ మాట్లాడుతూ, కవిత కమిట్ అయితే ఎంత కష్టమైనా వెనుకడుగు వేయరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లే నాయకత్వం ఆమెదేనని పేర్కొన్నారు. జాగృతి జెండాను ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని తెలిపారు.

# నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



**ఎల్కతుర్తి ఏప్రిల్ 08 ప్రజా మంటలు** :ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు నిలిచిందని గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముష్కే శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 26500 రూపాయల విలువైన చెక్కు లబ్ధిదారులైన పంజాల రాణి కి బుధవారం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెండ్యాల కుమారస్వామి, ఆరేపల్లి సమ్మయ్య, ఆరేపల్లి చిరంజీవి, మాజీ ఉపసర్పంచులు ఆరేపల్లి సమ్మయ్య, ఆరేపల్లి రమేష్, మాజీ వార్డు సభ్యులు పెండ్యాల భాస్కర్, పెండ్యాల సామెల్, బండి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాల మధు, గూటం శ్రీనివాస్ రెడ్డి, జివిస్ రెడ్డి, మాటూరి శ్రీనివాస్, శివరాత్రి మల్లయ్య, ఆరేపల్లి ఎల్లయ్య, కింసారపు సంపత్, పెండ్యాల పౌలు, ఆరెపల్లి కళ్యాణ్, ఎస్ డి. హుస్సేన్, ఎస్ డి. కరీం, మేకల రాజు, హుస్నాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయకులు పంజాల అభిలాష్, పెండ్యాల రాజేష్, పంజాల అజయ్, కస్తూరి నవీన్, తదితరు లు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు ముందడుగు

**రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్**

**కంటోన్మెంట్‌లో ఘనంగా డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ**




**సికింద్రాబాద్,ఏప్రిల్ 08 ( ప్రజా మంటలు ) :**రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మారేడ్‌పల్లి, సిల్వర్ కాంపౌండ్ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం బొలంరాయిలోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూడతమ సొంత భూములను ప్రభుత్వానికి ఇచ్చి ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు ఇళ్లు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇళ్ల పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపించిన ఆనందం ప్రభుత్వానికి మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూడకంటోన్మెంట్ ప్రాంతంలో స్థలాల కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి, కంటోన్మెంట్ బోర్డు మరియు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అవసరమైన స్థలాలను సమకూర్చి మరిన్ని ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా అందరూ కలిసి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టిలో కూడా ఈ అంశం ఉందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి, తహసీల్దార్లు మొహమ్మద్ అసదుల్లా ఖాన్, పాండు నాయక్, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వైద్య పరికరాల సరఫరాదారుల గోడు

**ఏడాదిగా నిలిచిన బకాయిలు.. రూ.445 కోట్ల పెండింగ్**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 08 ( ప్రజా మంటలు):** రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య పరికరాలు, సర్జికల్ సామగ్రి సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు బకాయిల కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికిపైగా చెల్లింపులు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ తెలిపింది.ఈ మేరకు టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు బుధవారం ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామచంద్రం టిజిఎం ఎస్ఐడిసి ఎండి గౌరవ్ ఉప్పల్( ఐఏఎస్) కు వినతిపత్రం సమర్పించారు. మందుల సరఫరాకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్నారని, సర్జికల్ డిస్పోజబుల్స్, డయాగ్నస్టిక్ కిట్లు, పరికరాల బిల్లులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024-25లో సర్జికల్ ఐటమ్స్‌కు పరిమితంగా నిధులు విడుదల కాగా, అదే సంవత్సరంలో సుమారు రూ.120 కోట్ల విలువైన సామగ్రి కొనుగోలు చేశారని తెలిపారు. 2025-26లో కూడా దాదాపు రూ.100 కోట్ల మేర సరఫరా చేసినప్పటికీ, ఇప్పటివరకు రూ.200 కోట్ల మందుల బకాయిలు, రూ.110 కోట్ల సర్జికల్ బకాయిలు చెల్లించలేదన్నారు. అదనంగా పరికరాలకు సంబంధించిన రూ.125 కోట్ల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.మరోవైపు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు సిద్ధం కాకముందే పరికరాల కొనుగోలు చేస్తుండటంపై అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. గాంధీ ఆసుపత్రిలో మల్టీ ఆర్గాన్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్ థియేటర్‌కు సంబంధించిన పరికరాలు ఏడాదిగా వినియోగంలోకి రాక స్టోర్లలోనే ఉండిపోతున్నాయని తెలిపింది. తక్షణమే బకాయిలు విడుదల చేసి ఆసుపత్రుల నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సరఫరాదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో బ్యాంకుల్లో తమ రుణాలు పెరిగిపోయాయని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు కోరారు.

# ‘ఆ విషయంలో ఎల్ అండ్ టీ హామీ ఇస్తేనే ముందుకు‘

**మెట్రో స్వాధీనంపై ఆచితూచి వ్యవహరిస్తున్న ప్రభుత్వం**

**రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియలో పలు ఆసక్తికర అంశాలు**

**భవిష్యత్తు సవాళ్ల దృష్ట్యా ఆచితూచి వ్యవహరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**



కొన్ని విషయాల్లో ఎల్ అండ్ టీ పూచీకత్తు కోరుతున్న సర్కారు

హైదరాబాద్‌లో ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో నడుస్తున్న మెట్రో రైలు ఫస్ట్ ఫేజ్ ప్రాజెక్ట్‌లో ఆ సంస్థకున్న వాటాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రక్రియలో పలు ఆసక్తికర అంశాలు ప్రస్తుతం తెరమీదకు వస్తున్నాయి. సంబంధిత ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కోరుతున్నా, భవిష్యత్తులో తలెత్తే సమస్యలు, ఆర్థికపరమైన సవాళ్ల దృష్ట్యా ప్రభుత్వం ఆచితూచి అడుగులేస్తోంది. ఆ సంస్థ నుంచి అవసరమైన హామీలు, పూచీకత్తులను తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఈ షరతులను అమలు చేస్తేనే స్వాధీన ఒప్పందం ముందుకు సాగుతుందని స్పష్టం చేస్తుంది.

**థేల్స్ వివాదం ఏంటంటే :** మెట్రో తొలి దశ నిర్మాణంలో రైళ్ల సిగ్నలింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలను ఫ్రాన్స్ దేశానికి చెందిన థేల్స్ అనే సంస్థ సమకూర్చింది. ప్రాజెక్ట్ ఆలస్యం కావడంతో పెరిగిన ఖర్చుల విషయంలో ఎల్ అండ్ టీ, థేల్స్ మధ్య ఆర్థిక, టెక్నికల్ విభేదాలు తలెత్తాయి. సిగ్నలింగ్ వ్యవస్థలోని పలు లోపాలు, మార్పులకు సంబంధించిన బాధ్యత ఎవరిదనే అంశంపైనా ఇంకా కొన్ని చట్టపరమైన వివాదాలు ఉన్నాయి. వాటిని పరిష్కరించుకోవడం ఒక కీలకమైన షరతుగా ఉంది. మొదటి దశతో రెండోదశ అనుసంధానానికి పాత సిగ్నలింగ్ వ్యవస్థ అత్యంత కీలకం. ముందు ముందు సమస్యలు రాకుండా, ఒకవేళ థేల్స్ సంస్థకు, ఎల్ అండ్ టీ బకాయిలు చెల్లించాల్సి వస్తే ఆ భారం నేరుగా ప్రభుత్వంపైన పడకూడదంటే ఈ విషయంలో ప్రభుత్వానికి సంబంధం లేదని ఎల్ అండ్ టీ కంపెనీ హామీ ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**సీఎంఆర్ఎస్ అనుమతి :** హైదరాబాద్ మెట్రోరైలు నిర్వహణ ప్రైవేటు నుంచి ప్రభుత్వానికి మారబోతోంది. ఈ తరహా కీలక మార్పులు జరిగినప్పుడు మెట్రోరైల్వే ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ చట్టం ప్రకారం కమిషనరేట్ ఆఫ్ మెట్రోరైలు సేఫ్టీ (సీఎంఆర్ఎస్) పర్మిషన్ తప్పనిసరి కావాల్సిందే. కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న పట్టాలు, మెట్రో కోచ్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ సురక్షితంగా ఉన్నాయని సీఎంఆర్ఎస్ కచ్చితంగా నిర్ధారించాలి. ఈ మేరకు ముందస్తు షరతు కూడా ప్రభుత్వం కోరుతుంది.

**బకాయిలు తేలితేనే :** మొదటి దశ హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు టేకోవర్ చేసుకోవడానికి గతంలో ఒప్పందం కుదిరింది. ఇందులో ఎల్ అండ్ టీ సంస్థకు నేరుగా ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మూలధనం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించేలా అవగాహన సైతం కుదిరింది. ఈ నిధులు హెచ్ఎండీఏ నుంచి చెల్లించే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొన్నప్పటికీ దీనిపై ఇంకా ఏ మాత్రం స్పష్టత లేదు. మిగిలిన రూ.13 వేల కోట్లు వేర్వేరు సంస్థల నుంచి తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీ రేట్లు 6 నుంచి 9 శాతం వరకు ఉన్నాయి. ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ సంస్థ పూచీకత్తుగా ఉంది. ఈ లోన్లను మళ్లీ రీఫైనాన్సింగ్ చేయబోతున్నారు. దీనికి ఇప్పటినుంచి ప్రభుత్వమే పూచీకత్తు ఇస్తుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు అంగీకరించిందని, ఆ విధి విధానాలపై ఇప్పటికే పలు చర్చలు నడుస్తున్నాయని ప్రభుత్వ అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ కూడా ఇంకా కొలిక్కి రావాల్సిన అవసరం ఉంది.

**రూ.100 కోట్ల బకాయిలు :** ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ ప్రకటనలపై రూ.100 కోట్ల వరకు పన్ను బకాయిలు రావాల్సి ఉందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చెబుతోంది. ఉప్పల్, మియాపూర్ డిపో భవనాల ఆస్తి పన్ను వార్షికంగా రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు పెండింగ్‌లో ఉందని జీహెచ్ఎంసీ పేర్కొంది.

# ప్రమాదాల నివారణపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి

**వాహనాలకు ‘క్యూఆర్ రిఫ్లెక్టివ్‘ టేపులు తప్పనిసరిగా ఉండాల్సిందే**

**రాత్రివేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

**వాహనాలకు క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపుల ఏర్పాటుకు నిర్ణయం**

**ప్రతి వాహనానికి తప్పనిసరి చేస్తూ రవాణాశాఖ ఆదేశాలు**



రాత్రివేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వాహనాలకు క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపులు ఏర్పాటు చేయాలని నిబంధనలు జారీ చేసింది. ప్రతి గూడ్స్ వాహనంతో పాటు ట్యాక్సీ ప్లేట్ నెంబరు కలిగిన కార్లు, బస్సులు, ఇతర వాహనాలన్నింటికీ ఈ రిఫ్లెక్టివ్ టేపుల ఏర్పాటును రవాణా శాఖ తప్పనిసరి చేసింది. వీటి ధరలు భారంగా మారాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదాల నివారణకు రిఫ్లెక్టివ్ టేపుల ఏర్పాటు :** రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ తెచ్చిన రిఫ్లెక్టివ్ టేపుల ఏర్పాటు నిర్ణయం సరైందే అయినా, దాన్ని అమలు చేస్తున్న తీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం రాత్రి వేళల్లో జరుగుతున్నాయని అధ్యయనంలో తేలింది. ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ఇటీవల తీసుకొచ్చిన నూతన విధానంతో రాత్రివేళల్లో వాహనాలను రోడ్డు పక్కన నిలిపినా, ఈ రిఫ్లెక్టివ్ టేపుల ద్వారా ఇతర వాహనదారులకు స్పష్టంగా కనపడతాయని అధికారులు అంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా తక్కువని చెబుతున్నారు. అయితే క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపులు, రియర్ మార్కింగ్ ప్లేట్‌లను వాహనాలకు ఏర్పాటు చేయాలంటే ఒక్కో వాహనానికి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. రవాణా శాఖ కేటాయించిన ప్రత్యేక ఏజెన్సీల ద్వారానే ఏర్పాటు చేసుకోవాలనడంపై వాహనదారులు మండిపడుతున్నారు.ప్రభుత్వాన్ని కోరుకునేది ఒక్కటే. దయచేసి మా గరీబ్ వాళ్ల నుంచి ఇంత తీసుకోకుండా, కొంచెం తక్కువ చేయాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాము.రవాణా శాఖ లోగోతో కూడిన హాలోగ్రామ్ టేపులు : టేపులను ఇతరుల వద్ద ఏర్పాటు చేసుకుంటే రవాణా శాఖ అధికారులు అనుమతించరు. గతంలో వాహనాలకు ముందు, వెనక భాగంలో పచ్చని, ఎర్రటి రంగుతో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసేవారు. తాజా టేపులపై రవాణా శాఖ లోగోతో కూడిన హాలోగ్రామ్, ప్రత్యేక నెంబరుతో కూడిన క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వాహనం పూర్తి వివరాలు తెలుస్తాయి. క్యూఆర్ రిఫ్లెక్టివ్ టేపులు వాహనాలకు ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. సర్కార్ సంకల్పం మంచిదైనా ప్రభుత్వమే రిఫ్లెక్టివ్ టేపులను అందిస్తే బాగుంటుందని వాహనాదాలు, ఆయా సంఘాల నాయకులు చెబుతున్నారు. డీజిల్, వాహనాల విడిభాగాల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తరుణంలో వాహన యజమానులపై రవాణా శాఖ భారం మోపుతోందని ఆరోపిస్తున్నారు. ఒక్కో వాహనానికి రూ.వేలల్లో వసూలు చేయడంపై పునరాలోచించాలని ప్రభుత్వాన్ని వాహన యాజమానులు వేడుకుంటున్నారు.“రేడియం స్టిక్కర్లు వల్ల మాపై అదనపు భారం పడుతోంది. కొత్త వాహనం తీసుకున్నప్పుడే అందులోనే ఈ రేడియం స్టిక్కర్లకు కావాల్సిన డబ్బులు చెల్లించే విధంగా తీసుకుంటే ఈ ప్రైవేట్ సెక్టార్ అనేది ఇంత దోచుకోదు. ప్రభుత్వమే ఒక ధర ఫిక్స్ చేసి ఆర్టీవోలకు ఇస్తే బాగుంటుంది.“బండికి ముందు వైట్, సైడ్ ఎల్లో, బ్యాక్ రెడ్ స్టిక్కర్లతో యథావిధిగా తిరుగుతున్నాయి. మూడు నెలలకోసారి ట్యాక్సులు కడుతున్నాము. అలాగే టోల్‌గేట్లు కడుతున్నాము. వాటిలోంచే తీసి నంబర్ ప్లేట్లు ఇచ్చినట్టుగా ఆ స్టిక్కర్లు కూడా ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది కదా. రేట్లు కూడా ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పినప్పటి నుంచి రూ.5 వేలు లారీకి, రూ.1000లు ఆటోకి, రూ.3 వేలు డీసీఎంకి వసూలు చేస్తున్నారు. ఇవి మాకు భారంగా మారాయి.

# విజయవాడలో ట్రాఫిక్ కష్టాలకు చెక్

**3 కీలక రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన**

**విజయవాడ తూర్పు, పెనమలూరు, గన్నవరం పరిధిలో రోడ్ల విస్తరణ**

**రూ.105 కోట్ల సీఆర్‌డీఏ నిధులతో రహదారుల విస్తరణ పనులు**

**విజయవాడ ట్రాఫిక్ సమస్యలు తీర్చేలా ప్రణాళిక**



విజయవాడ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రోడ్లు విస్తరణ, నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ. 105 కోట్లతో సీఆర్డీఏ నిధులతో పనులు చేపట్టనున్నారు. 3 కీలక రోడ్ల విస్తరణకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. విజయవాడ ప్రజలను ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి తప్పించేందుకు ఈ 3 కీలక రోడ్ల విస్తరణకు అడుగులు పడ్డాయి.విజయవాడ తూర్పుతో పాటు కృష్ణా జిల్లా పరిధిలోని పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఈ రోడ్ల విస్తరణ జరుగునున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బల్లెంవారి వీధి నుంచి పోరంకి వరకు, నిడమానూరు, ఆటోనగర్, మురళీ నగర్ రోడ్డు, బల్లెంవారి వీధి-నిడమానూరు జంక్షన్ రోడ్లను విస్తరించనున్నారు. బెజవాడ నుంచి శివారు ప్రాంతాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా వెళ్లేలా రోడ్లు విస్తరిస్తున్నట్లు మంత్రి నారాయణ శంకుస్థాపన కార్యక్రమంలో తెలిపారు. నగరంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.ట్రాఫిక్ కష్టాలకు చెక్: బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సిగ్నల్ పాయింట్ దాటాలంటే 10 నిమిషాల సమయం పడుతుంది. ఈ కష్టాలకు చెక్ పెట్టేలా కూటమి ప్రభుత్వం రాగానే చర్యలు చేపట్టింది. ఈ రోడ్ల విస్తరణతో ఆటోనగర్‌కు వచ్చే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కార్మికుల కష్టాలు తీరుతాయి. శివారు ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు. రోడ్ల విస్తరణకు శంకుస్థాపన జరగడంతో స్థానికులు నుంచి హర్షం వ్యక్తమవుతోంది. రాబోయే 8 నెలల్లో ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.నగర అభివృద్ధికి బాటలు: ఈ రోడ్డు విస్తరణ జరిగితే ఆటోనగర్ కి వచ్చే వాహనాలకి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. దీంతో పాటు బందరు రోడ్డు నుంచి ఏలూరు రోడ్డు నిడమానూరు వరకు మరో కొత్త రోడ్డు అభివృద్ధి అవుతుంది. ప్రజలు బెంజ్ సర్కిల్ మీదుగా రామవరప్పాడు వెళ్లకుండా ఆటోనగర్ బస్టాండ్ నుంచి ఏలూరు రోడ్డు శక్తి కళ్యాణ మండపం వద్దకు చేరుకోవచ్చు. ఎన్నో ఏళ్లుగా ఆటోనగర్ కార్మికులు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి భారీ వాహనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.‘బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఒక్కో సిగ్నల్ పాయింట్ దాటాలంటే పది నిమిషాల సమయం పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యమ్నాయ రహదారుల ప్రతిపాదన ముందుకు తీసుకొచ్చాం. గత ప్రభుత్వం ఆపిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఊరట కలుగుతుంది.‘ - నారాయణ, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిఈ రహదారులు పూర్తయితే వారి కష్టాలు తీరుతాయి. దీంతో పాటు శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ప్రత్యమ్నాయ రహదారులు ఏర్పడంతో నగర అభివృద్ధికి బాటలు పడతాయి.

# యుద్ధం ఆ మూడు దేశాలది.. మూల్యం మిగతా ప్రపంచానిది.. హర్మూజ్ టోల్!




పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరదించుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకరించినట్టు తెలిపారు. అయితే, ఈ శాంతి ఒప్పందం వెనుక ఉన్న ఓ షరతు ఇప్పుడు ప్రపంచ దేశాలను, ముఖ్యంగా భారత్ వంటి చమురు దిగుమతి దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

**ఏమిటీ కొత్త షరతు?**

ఈ ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ‘టోల్ ఫీజు’ వసూలు చేసేందుకు ఇరాన్, ఒమన్‌లకు అమెరికా అనుమతించినట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి నుంచే జరుగుతుంది. ఇప్పటివరకు అంతర్జాతీయ జలమార్గంగా ఉన్న దీనిపై ఎలాంటి రుసుములు లేవు. తాజా ఒప్పందం ప్రకారం.. ఈ మార్గంలో వెళ్లే ప్రతి నౌక నుంచి సుమారు 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.16 కోట్లు) వరకు టోల్ వసూలు చేయవచ్చని అంచనా. యుద్ధం వల్ల దెబ్బతిన్న తమ మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి ఈ నిధులను వినియోగిస్తామని ఇరాన్ వాదిస్తోంది.

**ప్రపంచంపై ప్రభావం**

ఈ టోల్ భారం నేరుగా చమురు ధరలపై పడుతుంది. రవాణా ఖర్చులు పెరగడంతో ముడిచమురు ధరలు పెరిగి, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతాయి. ఇది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసి, భారత్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అంతర్జాతీయ జలమార్గంపై రుసుములు వసూలు చేయడం ‘సముద్ర చట్టాల‘కు విరుద్ధమని గల్ఫ్ దేశాల కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. శాంతి పేరుతో ప్రపంచ దేశాల జేబులకు చిల్లు పెట్టడమేంటని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

# అగ్నివీర్ నియామకాల ప్రకటన విడుదల

**శాశ్వత ఉద్యోగాలతో పాటు పలు ప్రయోజనాలు**

**ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామకాలకు ప్రకటనలు విడుదల చేసింది**

**రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌లో క్వాలిఫై**

**ఎంపికైన వారికి శిక్షణతో పాటు నాలుగేళ్లు ఆర్మీలో సేవలు చేసే అవకాశం**



ఇండియన్ ఆర్మీ యువత కోసం కీలక ప్రకటన విడుదల చేసింది. అగ్నివీర్ విభాగాల్లో ఖాళీలు ఉన్న కారణంగా పది, ఇంటర్, డిగ్రీ మాత్రమే కాకుండా, 8వ తరగతి విద్యార్హత కలిగినవారూ పోటీ పడవచ్చని తెలిపింది. దీనికోసం రాత పరీక్షతో పాటు అనేక టెస్టులు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు శిక్షణతో పాటు నాలుగేళ్లు ఆర్మీలో సేవలు అందిస్తారు. తర్వాత వీరిలో 25 శాతం అగ్నివీర్‌లను పర్మనెంట్ ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. మిగిలిన వారికి సర్టిఫికేట్, ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేస్తారు.

**పోస్టులు, అర్హతలు:** ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలంటే కింద ఇచ్చిన వివరాల ప్రకారం తప్పని సరిగా అర్హతలు ఉండాలి. అవేంటంటే

అగ్నివీర్ జనరల్ డ్యూటీ: పదో తరగతి, కనీసం 45% మార్కులు, ఎత్తు 166 సెం.మీ.

అగ్నివీర్ టెక్నికల్: ఇంటర్ ఉత్తీర్ణులు లేదా ఐటీఐ/డిప్లొమా, ఎత్తు 165 సెం.మీ.

అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్: ఇంటర్ 60% మార్కులు, ఎత్తు 162 సెం.మీ.

అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్: 8వ తరగతి లేదా 10వ తరగతి (ట్రేడ్ ఆధారంగా), ఎత్తు 166 సెం.మీ.

సిపాయ్ ఫార్మా: డీఫార్మసీ/బీఫార్మసీ, ఎత్తు 165 సెం.మీ.

నర్సింగ్ అసిస్టెంట్: ఇంటర్‌లో 50% మార్కులు, ఎత్తు 165 సెం.మీ.

విమెన్ మిలటరీ పోలీస్: కేవలం మహిళలకు మాత్రమే, పదో తరగతిలో 45% మార్కులు, ఎత్తు 162 సెం.మీ.

వయసు పరిమితులు: ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు పరిమితి తప్పనిసరిగా ఉంటుంది. 17.5 ఏళ్ల నుంచి దాదాపు 25 ఏళ్ల వయసు వరకు తప్పకుండా ఉండి తీరాలి.

సిపాయ్ ఫార్మా: 19–25 సంవత్సరాలు

నర్సింగ్ అసిస్టెంట్: 23 సంవత్సరాలు వరకు

మిగతా పోస్టులు: 17.5 నుంచి 22 సంవత్సరాల మధ్య (జులై 1, 2005 – జులై 1, 2009 మధ్య జన్మించిన వారు).

పరీక్షలు: అగ్నివీర్‌లో నియామకాలు పొందాలంటే ముందుగా రాత పరీక్షను క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఇందులో 50 నుంచి 100 ప్రశ్నల దాకా ఉంటాయి. అందులో ఏఏ సబ్జెక్ట్స్ ఉంటాయంటే

ఆన్‌లైన్ పరీక్ష (తెలుగు లేదా ఇతర భాషల్లో), ప్రశ్నలు: జనరల్ నాలెడ్జ్, సైన్స్, మ్యాథ్స్, రీజనింగ్, కంప్యూటర్ సైన్స్,కంప్యూటర్ సైన్స్, జనరల్ ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (పోస్టు ఆధారంగా).

క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టులకు టైప్ పరీక్ష (నిమిషానికి 30 పదాలు).

బోనస్ మార్కులు: ఎక్స్ సర్వీస్ పిల్లలు (20), క్రీడాకారులు (20), ఎన్‌సీసీ ‘ా(5) దీ(10) జ (20), ఐటీఐ (20), డిప్లొమాలు (30) ఉన్నవారికి.

ఫిజికల్ పరీక్ష: రాత పరీక్ష పూర్తైన తర్వాత ఫిజికల్ పరీక్షలో క్వాలిఫై అవ్వాల్సి ఉంటుంది. అయితే అందులో ఎలాంటి టెస్టులు నిర్వహిస్తారంటే

1.6 కి.మీ. రన్ 5:30 నిమిషాల్లో పూర్తి చేయాలి.

కనీసం 6 పుల్ అప్స్.

జిగ్ జాగ్ బ్యాలెన్స్, జంపులు, ఛాతీ విస్తీర్ణం 77 సెం.మీ.

ఫిజికల్, మెడికల్ పరీక్షలు తప్పనిసరి.

ముఖ్య గమనిక : పరీక్షలు, ఫిజికల్ టెస్టులు తెలంగాణకు సికింద్రాబాద్, ఆంధ్రప్రదేశ్‌కు గుంటూరు, విశాఖపట్నం కేంద్రాల్లో నిర్వహిస్తారు.

వేతనం, ఇతర ప్రయోజనాలు: రాత పరీక్ష, ఫిజికల్ పరీక్షల్లో పాస్ అయిన వారు నియామకాలకు అర్హులు. వారికి సంబంధించిన వేతనాలు, అలానే ఇతర ప్రయోజనాలు ఎలా ఉన్నాయంటే

మొదటి సంవత్సరం నెలకు రూ.30,000,రెండో సంవత్సరం రూ.33,000, మూడో సంవత్సరం రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000.

వేతనం నుంచి 30% కార్పస్ ఫండ్‌కు జమ.

నాలుగు సంవత్సరాల సేవకు రూ.10.04 లక్షల సేవానిధి (ప్రభుత్వం + అగ్నివీర్ భాగస్వామ్యం).

అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్.

బ్యాంకుల నుంచి రుణాల ఏర్పాటు.

శాశ్వత ఉద్యోగం: అగ్నివీరులకు ఇందులో నాలుగేళ్లు సర్వీస్ కాలం ఉంటుంది. ఈ కాలం పూర్తి చేసిన వారిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగంలోకి ఎంపిక చేసుకుంటారు. మిగిలిన వారికి ఆర్మీ నుంచి కొంత ఆర్థిక సహాయం, ఇతర ప్రయోజనాలు అందుతాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: ఏప్రిల్ 10 వరకూ స్వీకరిస్తారు.

ఫీజు: రూ.250.

ఆన్‌లైన్ పరీక్షలు: జూన్ 1 నుంచి జులై 15 వరకు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in/.

# ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాలు

**ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు**

**ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష**

**ఈ ఏడాది మరోసారి సామూహిక గృహ ప్రవేశాలు**

**టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షల ఇళ్లు ఇవ్వాలని ఆదేశం**



సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఈ ఏడాదిలో మరోసారి చేపట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకాలు, కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఆలస్యం ఉండకూడదన్నారు. ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. దాదాపు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలిందన్నారు. ఆ దిశగా చర్యలకు అధికారులను సీఎం ఆదేశించారు.వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద, స్టాక్ యార్డుల వద్ద ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేకుండా గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

**కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి:** కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత కాలానికి తగినట్లుగా రీ-ఓరియేంటేషన్ చేయాల్సి ఉందన్నారు. యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం కావాలన్నారు. ట్రెడిషన్ కోర్సులతో పాటు డిమాండ్ ఉన్న వాటిని, కొత్త కరిక్యులాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ఆంధ్రా యూనివర్శిటీతో పాటు మిగిలిన వర్శిటీలూ ర్యాంకులను మరింతగా పెంచుకోవాలన్నారు. ఉన్నత విద్య మండలి మరింత చురుగ్గా పనిచేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి ఫిర్యాదులు, విమర్శలు రాకూడదని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన:** ప్రజల్లో, యువతలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేలా శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచాలన్నారు. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు, మరణాలు జరుగుతున్నందున నివారించాలన్నారు. కఠిన నిబంధనలు అమలు కన్నా ముందు ప్రజలను చైతన్య పరచాలన్నారు.

**పిడుగుపాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదు:** విద్యుత్, కేబుల్ తీగలు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరగకూడదన్నారు. పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపుతున్నా అక్కడక్కడా మరణాలు జరగడం పట్ల సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మెసేజ్‌లు పెట్టటంతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బందినీ అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. అవేర్ 2.0 మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com